

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

***రచనాకాలం: 2000 సంవత్సరం***

**రాత్రి తొమ్మిదవుతోంది.** ఆదివారం కాబట్టి రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

విరించి కంప్యూటర్ క్లాస్ నించి బస్‌స్టాప్‌కి నడవసాగాడు. అతను బయటకి రాగానే అక్కడున్న ఇద్దరికి ఓ వ్యక్తి విరించిని చేత్తో చూపించి చెప్పాడు.

"ఆ రెడ్ స్ట్రయిప్స్ షర్ట్ అతను. జాగ్రత్త. చెప్పిందంతా గుర్తుందిగా?"

తల ఊపారు వాళ్ళు. తర్వాత ఇద్దరూ గబగబా విరించివైపు నడవసాగారు. విరించి దగ్గరకెళ్ళి చెప్పాడు ఒకడు.

"ఎక్స్‌క్యూజ్‌మి. మీ పేరేనా విరించి?"

"అవును. ఏం కావాలి?"

"మీ అన్నయ్య గోపీనాథ్ మిమ్మల్ని పిలుస్తున్నారు."

"ఎక్కడున్నాడు?"

"అదిగో. ఆ సందులో గ్రిల్స్ కనబడే ఇంట్లో."

"మీరెవరు?"

"ఆ ఇంటి ఓనర్‌గారి అబ్బాయిని నేను. మా ఇంటికి వచ్చాడు గోపి."

వాళ్ళ మాటలని ఏమాత్రం సందేహించకుండా విరించి ఆ సందులోకి నడిచాడు. వీధి దీపాలు వెలగని ఆ సందులోకి అతను వెళ్ళగానే వెనకే వచ్చిన ఇద్దరిలో ఒకడు విరించిని వెనకనించి చేతులు వెనక్కి గట్టిగా అదిమిపట్టుకున్నాడు. రెండోవాడు విరించి చేతులకి తక్కున బేడీలు వేసాడు.

"ఏయ్! ఏమిటిది? ఎవరు మీరు?" విరించి అరుస్తున్నా లక్ష్యపెట్టకుండా అతన్ని దెబ్బలు కొట్టసాగారు ఇద్దరూ. అతని వంటిమీది చొక్కా చిరిగిపోయింది. ముక్కు పగిలి రక్తం కారసాగింది. వాళ్ళ వేళ్ళగోళ్ళకి మెడ, చెంపలు గీసుకుపోయాయి.

"హెల్ప్, హెల్ప్" అరిచాడు. కానీ ఎవరూ హెల్ప్‌కి రాలేదు.

కొద్ది నిముషాల తర్వాత చీకట్లో వినిపించిందో గొంతు.

"ఇక చాలు."

తన అన్న గోపీనాథ్ కంఠం విని అంత భయంలోనూ ఆశ్చర్యపడ్డాడు విరించి. తర్వాత దగ్గరకి నడుచుకుంటూ వచ్చిన అన్నయ్యని చూసాడు. గోపీనాథ్ తమ్ముడ్ని పరీక్షగా చూసి తృప్తిగా తలాడించి చెప్పాడు.

"గుడ్"

ఆ ఇద్దరికీ చెరో అయిదువందల రూపాయలు ఇచ్చాడు.

'ఆదాబర్సే' అని వెళ్ళిపోతున్న వాళ్ళవంక, తర్వాత గోపీనాథ్ వంక చూసి అడిగాడు విరించి ఆశ్చర్యంగా.

"ఏమిటి ఇదంతా నువ్వే ఏర్పాటు చేసావా?"

"అవును."

"ఎందుకు?" రొప్పుతూ అడిగాడు.

"బాగా దెబ్బలు తగిలాయా?" అడిగాడు గోపీనాథ్ అనునయంగా.

"చంపేస్తారనుకుని భయపడ్డాను."

"రక్తం కనబడాలి కానీ దెబ్బలు తగలకూడదని ముందే చెప్పాను. కానీ నేననుకున్న దానికన్నా గట్టిగానే కొట్టారు."

"దేనికి?" ఇందాకటి ఆశ్చర్యం రెట్టింపైంది విరించిలో.

"చెప్తాను. నువ్విప్పుడు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళు. నిన్ను ఇద్దరు కొట్టి చంపాలనుకున్నారని, రోడ్డున పోయేవాళ్ళు కల్పించుకుని రక్షించారని రిపోర్ట్ చేయాలి."

"ఓ! ఇది అమెరికా వెళ్ళే ప్లాన్‌లో ఓ భాగం అన్నమాట" అడిగాడు విరించి.

"అవును. మొదటి చాప్టర్."

"ఎవరు చంపాలనుకున్నారని అడుగుతారు పోలీసులు."

"నాకు తెలీదని చెప్పు. నీకు ఎవరితోనైనా విరోధం వుందాని అడుగుతారు. లేదని చెప్పు. నిన్ను ఉస్మానియా హాస్పటల్‌కి తీసుకెళ్ళి మెడికల్ చెకప్ చేయించమను. ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయమని చెప్పు."

జేబులోంచి ఓ వెయ్యి రూపాయలు తీసిచ్చి చెప్పాడు గోపీనాథ్. ఆటోలో వెళ్ళి రావడానికి, ఎఫ్.ఐ.ఆర్ ఓపెన్ చేయడం ఓసం లంచాలకి ఇది వుంచు. వాళ్ళు నిన్ను డబ్బడగలేదు. వేలి వుంగరం కూడా తీసుకోలేదు."

"దేనికిదంతా?" అడిగాడు విరించి అర్థంకాక.

"అంతా తీరిగ్గా తెలుస్తుంది కానీ నువ్వు ముందు పద."

విరించి ఓ ఆటోని ఆపి పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నాడు.

రక్తం కారుతున్న అతన్ని దారిలో ఆటో డ్రైవర్ అడిగాడు ఏం జరిగిందని.

"రౌడీలు కొట్టారు" చెప్పాడు ముభావంగా.

ఆటో దిగి లోపలికి వెళ్ళాడు. రక్తం కారుతున్న అతన్ని చూడగానే సెంట్రీ చెప్పాడు.

"లోపల ఎస్.ఐ.ని కలు."

ఎస్.ఐ దగ్గరికి వెళ్ళి విష్ చేశాడు.

"ఎవరితో తగాదా పడ్డావు?" అడిగాడు ఎస్.ఐ నిర్లక్ష్యంగా.

"ఎవరితోనూ తగాదా పడలేదు సార్. ఇదే మొదటిసారి వాళ్ళిద్దర్ని చూడడం. నా చేతులకి వెనకాల హేండ్‌కప్స్ వేసి కొట్టారు." జరిగింది వివరించాడు.

"కొట్టాక ఒకడు నా గొంతు పిసుకుతుంటే, ఇంకొకడు నన్ను గట్టిగా పట్టుకున్నాడు. ఇవాళ చచ్చిపోతాననుకున్నాను. కానీ సరిగ్గా అదే సమయంలో ఓ కారు ఆ సందులోకి తిరిగింది. అందులోంచి నలుగురు దిగుతూంటే వాళ్ళని చూసి పారిపోయారు.

"నీకు ఎవరితో శత్రుత్వం వుంది? వాళ్ళని ఎవరైనా పంపించారని అనుమానంగా వుందా?"

"అలాంటిదేం లేదు సార్!"

"ఏం చేస్తుంటావు? "

"జిరాక్స్ షాపు నడుపుతున్నాను. మళ్ళీ వాళ్ళు నన్ను ఎటాక్ చేయడానికి వస్తారేమోనని భయంగా వుందండి."

బేడీలు తీసేసి ఓ కానిస్టేబుల్‌ని తోడిచ్చి ఉస్మానియా హాస్పిటల్‌కి పంపాడు ఎస్.ఐ. కేష్ ముట్టాక. అక్కడ డాక్టర్ విరించి గాయాలకి మందులు రాసాడు.

అవుట్ పేషంట్‌గా విరించిని ట్రీట్ చేసినట్లు నమోదు చేసాక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ ని నమోదు చేసాడు ఎస్.ఐ.

ఇంటికి దెబ్బలతో వచ్చిన రెండో కొడుకుని చూసి మాలతి కంగారు పడింది.

"ఏమైందిరా నీకు? ఎవరి జోలికి వెళ్ళని వాడివి, ఎవరేం చేసారు నాయనా నిన్ను?" అడిగింది దుఃఖంతో.

"గర్ల్ ఫ్రెండ్స్ వుండే వయసులో మొహాన బేండ్ ఎయిడ్స్ మామూలే అమ్మా" చెప్పాడు గోపీనాథ్ నవ్వుతూ.

"ఊరుకో క్రూర నాగన్న. వాడలాంటివాడు కాదు."

"ఏం జరిగింది?" అడిగాడు అరుణాచలం.

"నేను కంప్యూటర్ క్లాస్‌నుంచి వస్తుంటే దొంగలు నావెంట పడ్డారు. నా దగ్గర వందలోపే వుంది. మెళ్ళో బంగారు గొలుసు, చేతికి ఉంగరాలు లేవే అని కొట్టి వదిలేసారు."

"ఛీ.ఛీ! రోజులు మరీ పాడైపోతున్నాయి" అని చెప్పింది తల్లి బాధగా.

తల్లిదండ్రులు లోపలికి వెళ్ళాక అడిగాడు గోపీనాథ్ తమ్ముడిని రహస్యంగా.

"అంతా సక్రమంగానే జరిగిందా?"

"ఆ. ఎఫ్.ఐ.ఆర్ ఓపెన్ చేసారు. నువ్వు చెప్పినట్లుగానే హాస్పిటల్‌లో నన్ను అవుట్ పేషంట్‌గా ట్రీట్ చేసినట్లు సర్టిఫికెట్ తీసుకున్నాను. ఎక్కడైనా డబ్బిస్తే కాని పనికాదులా వుంది."

"మన సంస్కృతే అది. రేపు అమెరికాకి వెళ్ళాక చూస్తే అక్కడ సంస్కృతి ఎంత శుభ్రంగా వుంటుందో నీకే తెలుస్తుందిగా?"

"ఇంతకీ వీటివల్ల ఏమిటి ఉపయోగం?" అడిగాడు విరించి అన్నయ్యకి ఆ కాగితాలిచ్చి.

"అమెరికాకి నిన్ను విమానం ఎక్కించబోయే రోజుదాకా ఆగు."

"అది సరే. అసలు నాకు అమెరికాకి వీసానే ఇవ్వకపోతే? అది గ్యారంటీ లేదుగా?"

"నీకు గ్యారంటీగా అమెరికాకి వీసా వస్తుంది" స్థిరంగా చెప్పాడు గోపీనాథ్.

"పి.యం రికమండేషన్ కూడా అక్కడ పనిచేయదట. ఏమిటి గారంటీ?"

"నాదీ గారంటీ. సరా?"

గోపీనాథ్‌కి ఆ విషయంలో కూడా ఏదో పథకం ఉండి వుండవచ్చు అనుకున్నాడు విరించి. ఆ విషయం మీద మళ్ళీ ప్రశ్నించలేదు.

మర్నాడు ఉదయం గోపీనాథ్ ఓ షాప్‌కి వెళ్ళి ఆరోజు హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, డెక్కన్ క్రానికల్ దినపత్రికలు కొన్నాడు.

అతనూహించినట్లుగానే రెండు దినపత్రికల్లో గతరాత్రి విరించికి బేడీలు వేసి ఎవరో గుర్తుతెలియని దుండగులు దాడిచేసి కొట్టినట్లు క్రైం సమాచారం వచ్చింది.

## 7

విరించి తన గర్ల్‌ఫ్రెండ్ మానసి ఇంటికి ఫోన్ చేసాడు మర్నాడు. ఆమె లైన్లోకి రాగానే చెప్పాడు.

"హలో. ఇవాళ కలుద్దామా?"

"సారీ – కుదరదివ్వాళ."

"ఏం? అంతబిజీనా?"

"అవును. నా కంప్యూటర్ పాడైంది."

"దాని రిపేర్ పనా?"

"కాదు. కూడికలు, హెచ్చవేతలు నేర్చుకోవాలి."

"జోకు బావుంది కాని ఓసారి కలుద్దామోయ్."

"పెళ్ళికి ముందే? నోనో."

ఫక్కున నవ్వాడు.

"జోక్ పేలింది కాని, తెలుగు సినిమాల్లో డబుల్ మీనింగ్స్ ఎప్పుడో పోయాయి. అయినా నేను అడిగేది అదికాదు. ఇంకోటి."

"నాకు తెలుసది.. కొంచెం సేపుండు."

దాదాపు నిముషం తర్వాత వినిపించింది మళ్ళీ మానసి కంఠం.

"ఇప్పుడు చెప్పు."

"ఏమయ్యావింతసేపు?"

"కార్డ్‌లెస్‌తో టెర్రస్ మీదకి వచ్చాను. మా అన్నయ్య వింటే ఇంకేమైనా వుందా?"

"ఎక్కడ కలుసుకుందాం? సినిమా థియేటర్? కన్నడం నుంచి డబ్ చేసిన సినిమా ఒకటి ఆడుతోంది. రన్నింగ్ టు ఎంప్టీ హౌస్."

"సరే. నువ్వు ముద్దుకి తెగ తహ తహలాడుతున్నావు కదా. జామెంట్రీ సబ్జెక్ట్‌లో కిస్‌కి డెఫినిషన్ ఇవ్వు చూద్దాం?"

"జామెంట్రీలోనా? తెలీదు."

"ఏ కిస్ ఈజ్‌ది షార్టెస్ట్ డిస్టెన్స్ బిట్వీన్ టు కర్వ్స్ ఇన్ ది రైట్ ఏంగిల్."

"బావుంది."

"ఇలా కూడా చెప్పచ్చు."

"ఎలా?"

"ఏ కిస్ ఈజ్ ది షార్టెస్ట్ డిస్టెన్స్ బిట్వీన్ టు లిప్స్. మరి ఫిజిక్స్‌లో తెలుసా?"

"చెప్పు వింటాను."

"ఏ కిస్ ఈజ్ ది కాంట్రాక్షన్ ఆఫ్ ది మౌత్ డ్యూ టు ది ఎక్స్ టెన్షన్ ఆఫ్ ది హార్ట్."

"ఎక్స్‌లెంట్. ఇంకా ఏ సబ్జెక్ట్స్ చెప్తావు?"

"అన్నీ. ఇదే సబ్జెక్ట్లో కనుక్కో. ఏ కిస్ ఈజ్ ఇన్ డిమాండ్ మచ్ గ్రేటర్ దేన్ ఇట్స్ సప్లయ్."

"ఎకనామిక్స్."

"కరెక్ట్ ఇదీ? ఏ కిస్ ఈజ్ ఏన్ ఈవెంట్ హూజ్ ప్రాబబిలిటీ ఇంక్రీజెస్ విత్ బెటర్ వైటల్ స్టాటిస్టిక్స్"

"స్టాటిస్టిక్స్‌తో మిస్ చేసావు. నువ్వు చెప్పిందిలా కూడా చెప్పచ్చు. ఏ కిస్ ఈజ్ ఏన్ ఈవెంట్ హూజ్ ప్రాబబిలిటి డిపెండ్స్ ఆన్ ది వైటల్ స్టాటిస్టిక్స్ ఆఫ్ తర్టిసిక్స్ ట్వంటీఫోర్ - తర్టీసిక్స్."

"అండ్ దిస్ ఒన్? ఏ కిస్ ఈజ్ ఏ ఛేంజ్ ఇన్ హార్ట్ బీట్. జస్ట్ ఒన్ కిస్ అండ్ ది హార్ట్ బీట్ షూట్స్ అప్."

"యం.బి.బి.యస్?"

"అది సబ్జెక్ట్ కాదు. మెడిసిన్. సబ్జెక్ట్ ఇంకోటిది. ఏ కిస్ ఈజ్ ఏ నౌన్ ప్రిమారిటల్లీ అండ్ ఏ వెర్బ్ వెన్ మేరీడ్"

"ఇంగ్లీష్."

"యస్" చెప్పింది మానసి.

"ఇంగ్లీష్‌లో ఇంకోలా డిఫైన్ చేయచ్చు. ఏ కిస్ ఈజ్ నౌన్ అన్నోన్ అండ్ వెన్నోన్ ఇట్ ఈజ్ ఏ వెర్బ్. అగ్రీడ్?"

"అగ్రీడ్ ఏ కిస్ ఈజ్ ఏ మల్టిప్లికేషన్. ఇఫ్ యూ గివ్ ఒన్, యూ గెట్ టు ఇన్ రిటర్న్."

"మేథ్స్. ఈ సబ్జెక్టులో నీకు ట్యూషన్ చెప్పమంటావా?"

"అండ్ ఫైనల్లీ ఆల్జీబ్రా.. కిస్ ఈజ్ ఇన్ఫినేట్ బికాస్ టు డివైడెడ్ బై నథింగ్."

"ఇంకా?"

"కిస్ ఈజ్ ఏ క్రెడిట్ బికాస్ ఇట్స్ ప్రాఫిటబుల్ వెన్ రిటర్న్. అర్థమైందా?"

"ఆహా అకౌంటెన్సీ సబ్జెక్ట్ అది. అయితే అకార్డింగ్ టు డెంటిస్ట్రీ కిస్ ఈజ్ ఇన్ఫెక్షువస్..."

"....అండ్ ఏంటి సెప్టిక్ టూ" చెప్పాడు విరించి.

"ఆర్కిటెక్చర్ సబ్జెక్ట్ ప్రకారం ఏ కిస్ ఈజ్ ది ప్రాసెస్ విచ్ బిల్డ్స్ ఏ సాలిడ్ బిట్వీన్ టు డైనమిక్ ఆబ్జెక్ట్స్"

"ఫైనల్లీ ఫిజియాలజీ ప్రకారం ఏ కిస్ ఈజ్ జుక్‌సాటు పొజిషన్ ఆఫ్ టు ఆర్బిక్యులర్ ఇసోరిస్ మజిల్స్ ఇన్ ది సైట్ ఆఫ్ కాంట్రాక్షన్."

"ఇన్ని సబ్జెక్ట్‌లలో ముద్దుని ఇంత మురిపెంగా ఎందుకు వర్ణించారంటే మనిద్దరం ముద్దుపెట్టుకోవాలని..."

"నాట్ అంటిల్ మేరేజ్."

"ఐన్‌స్టీన్ ఏం చెప్పాడంటే పెళ్ళికి ముందు నిముషం సేపు పెట్టుకునే ముద్దు క్షణం సేపులా అనిపిస్తుందిట. పెళ్ళయ్యాక క్షణం సేపు పెట్టుకునే ముద్దు పదినిమిషాల్లాగా అనిపిస్తుందిట. కాబట్టి ఆ తర్వాతవి ఇప్పుడే ఇచ్చేస్తే గొడవుండదు."

"మిస్టర్! పెళ్ళికి ముందు ముద్దులు వృథా. ఎందుకంటే అవి పాలని ఫోర్క్‌తో తాగినట్లుంటుంది. నోటిని తీపి చేస్తుంది, కానీ కావలసిందంతా అందదు."

సన్నగా నవ్వాడు విరించి.

"కమేడియన్స్ తమ లేడీ గేన్స్‌ని ఎన్నడు ముద్దుపెట్టుకోలేరు పాపం" చెప్పాడు.

"ఏం?"

"వాళ్ళని చూడగా నవ్వొస్తుంది. ఏడ్చే కళ్ళనన్నా ముద్దుపెట్టుకోవచ్చు కానీ నవ్వే పెదవులని ముద్దుపెట్టుకోలేం."

"పాస్‌పోర్ట్‌కి అప్లయ్ చెయ్యమన్నాను. చేసావా?"

"ఫోటోలు తెప్పించాను. నువ్వు అమెరికాకి బయలుదేరబోయేలోగా నాకు పాస్‌పోర్ట్ ఖాయంగా వస్తుంది. సరా? బైబై."

రిసీవర్ పెట్టేశాడు విరించి.

అనసూయని చూడటానికి ఆమె రెండో అబ్బాయి దామోదర్ వచ్చాడు తన భార్యతో. గోపీనాథ్‌తో కాసేపు పిచ్చాపాటీ మాట్లాడాడు అతను. తర్వాత తన తల్లిని తమ ఇంటికి రమ్మని కోరాడు.

"వచ్చి నాలుగురోజులు కూడా కాలేదుగా. ఓ వారం పోయాక వస్తాలే" చెప్పిందావిడ.

ఆ విషయం మీద తల్లి కొడుకు మాటామాటా అనుకున్నారు. గోపీనాథ్ అడిగాడు దామోదర్‌ని టాపిక్ మార్చడానికి.

"మీ బావమరిదికి ఉద్యోగం దొరికిందా?"

"ఆ. ఎస్.ఐ.గా రిక్రూట్ అయ్యాడు."

"ఎక్కడ? ట్విన్ సిటీస్‌లోనేనా?"

"అవును. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నాడు."

"అలాగా?"

కొద్దిక్షణాలు ఆలోచిస్తూండిపోయాడు. తర్వాత అడిగాడు.

"అతని పేరేమిటి? మర్చిపోయాను."

"శివాజీ" చెప్పింది దామోదర్ భార్య.

"నేనోసారి అతన్ని కలుస్తాను. ఆ ముక్క అతనితో చెప్తావా?" అడిగాడు గోపీనాథ్.

"అలాగే - ఏదైనా పనుందా?" అడిగాడు దామోదర్.

"అవును - రేపో ఎల్లుండో కలుస్తాను."

అతని ఫోన్ నంబర్ రాసుకున్నాడు గోపీనాథ్.

గోపీనాథ్ అనసూయ కొడుకు బావమరిది కోసం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు. శివాజీ డ్యూటీలోనే వున్నాడు. వాళ్ళిద్దరిదీ ముఖపరిచయం మాత్రమే. వెంటనే అతడు గుర్తుపట్టకపోతే తనే పరిచయం చేసుకున్నాడు.

"ఓ! మీరా గుర్తొచ్చారు. అమెరికాలో వున్నారని విన్నాను. ఎప్పుడొచ్చారు?"

"నెలవుతోంది."

"ఏమిటిలా వచ్చారు? ఎనీ ప్రాబ్లం?"

"ప్రాబ్లం ఏం లేదు కానీ నాకు మీ సహాయం కావాలి."

"ఏమిటి?"

"మా తమ్ముడు మీకు తెలుసుగా? పేరు విరించి. వాడికి ఐ.ఎస్.ఐ. ఏజెంట్లనించి ప్రాణభయం వుందన్న సాక్ష్యం అవసరపడింది నాకు. ఆ విషయంలో మీ సలహా, సహాయం కావాలని వచ్చాను" చెప్పాడు గోపీనాథ్.

"వాళ్ళకీ, మీ తమ్ముడికి ఎలా పరిచయం అసలు?" అడిగాడు శివాజి ఆశ్చర్యంగా.

"నిజానికి మా తమ్ముడికి ఐ.ఎస్.ఐ ఏజంట్లు తెలియరు. కానీ మా తమ్ముడికి వాళ్ళనించి ప్రాణభయం వుందన్న సాక్ష్యం క్రియేట్ చేసే అవసరం ఏర్పడింది."

"ఏమిటా అవసరం?"

"మా వాడు అమెరికా వెళ్తున్నాడు. వెళ్ళాక అక్కడ సెటిల్ అవడానికి అవసరం అవుతుందది."

"నాకా కనెక్షన్ బోధపడలేదు."

పొలిటికల్ అసైలమ్ గురించి సూక్ష్మంగా వివరించాడు గోపినాథ్.

"కాబట్టి పాకిస్తాన్ గూఢచారులనించి మా వాడికిక్కడ ప్రాణభయం వుందన్న రుజువులతో వెళ్తే అక్కడ పని తేలికవుతుంది."

"దానికి ఏం చేద్దామంటారు?"

"ఇవాళ రాత్రో, రేపో మీరు డ్యూటీలో వుండనుగా? సెంట్రీ, నైట్ డ్యూటీ కానిస్టేబుల్స్ వుంటారు. వాళ్ళెవరికీ తెలీకుండా ఈ రిపోర్ట్ రాయడం కష్టం."

"తెలియాల్సిన ఒకరిద్దరిని మీరు మీ వైపు తిప్పుకుంటే చాలు."

శివాజీ సిగరెట్ తాగుతూ కొద్దిసేపు ఆలోచిస్తుండిపోయాడు. తర్వాత చెప్పాడు.

"అదొక్కటే చాలదు. ఎఫ్.ఐ.ఆర్.కి గాయాలతో వున్నవాడిని ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్పించాలి. లేదా ఓ.పి.గా నయినా ట్రీట్ చేయించాలి."

"అక్కడా ఇలాగే మీరు మేనేజ్ చేయలేరా?" అడిగాడు గోపీనాథ్.

"మీకు తెలీనిదేముంది? అందుకు కొంత ఖర్చవుతుంది."

'ఇందులో రిస్క్ వుంది. మొత్తం బయటపడితే నా ఉద్యోగం పోతుంది. కుదరదు' అంటాడనుకున్నాడు గోపినాథ్. కానీ అలాకాక ఇన్‌డైరెక్ట్‌గా లంచం ఇస్తే పనిచేసి పెడతానని శివాజి వప్పుకున్నాడని గ్రహించగానే గోపీనాథ్‌కి సంతోషం వేసింది.

తనను నౌకనెక్కించి అమెరికానించి నిర్దాక్షిణ్యంగా గెంటేసిన అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీస్ వాళ్ళని బీట్ చేయడానికి తను కొంత ఖర్చు చేయడానికి సిద్ధంగానే వున్నాడు గోపీనాథ్.

"ఎంతవుతుంది?" అడిగాడు.

"వేలల్లోనే. జరగని నేరం జరిగిందని రికార్డ్ చేయడం రిస్క్‌తో కూడిన పని. నేరస్థుడ్ని వదిలేయడంలో పెద్దగా రిస్క్ వుండదు. సరైన ఎవిడెన్స్ దొరకలేదని, లేదా దొరికింది సప్రెస్ చేయచ్చు కానీ ఇది రిస్క్."

"ఎన్ని వేలు?"

"మాములుగా అయితే పదివేలు. అలా అయితే ఇందులో నేను మీకు హెల్ప్ చేసిందేముంది?" అని మరికొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు "అయిదు వేలతో మొత్తం పని పూర్తిచేస్తాను. ఇందులో నేను పైసా ఆశించను. మీరు నా బంధువు కాబట్టి మిగిలినవాళ్ళకి పంచడానికి. మా డిపార్ట్‌మెంట్‌లో మాట సహాయాలుండవు. స్వంత పనికి కూడా తినిపించాలి. ఓన్లీ కేష్ స్పీక్స్."

మారుమాట్లాడకుండా గోపీనాథ్ జేబులోంచి కొత్త ఏభై రూపాయల కట్టనొకదాన్ని తీసి అతనికివ్వబోతుంటే చెప్పాడు శివాజు.

"అలాక్కాదు."

ఓ కానిస్టేబుల్‌ని కేకేసాడు. అతను రాగానే పేపర్ తీసుకురమ్మన్నాడు. న్యూస్‌పేపర్ తెచ్చాక అందులో ఆ కట్టని చుట్టించి తీసుకుని చెప్పాడు.

"ఏ.సి.బి భయంవల్ల మా డిపార్ట్‌మెంట్‌లో జనరల్‌గా ఎవరం మాది కాని డబ్బుని చేత్తో తాకం."

"కానీ ఈ డబ్బు ఎక్కడినించి వచ్చిందని వాళ్ళడిగితే?"

"ఏదైనా చెప్పచ్చు. వాటిమీద రాసిన కెమికల్ నా చేతికి అంటుకోకపోతే అది కేసు బుక్ చేసేంత గొప్ప విషయం కాదు. నా సేవింగ్స్ కన్నా తక్కువ అమౌంట్. ఏం చెయ్యలేరు వాళ్ళు."

"నే చెప్పింది అర్థమైందిగా?"

"ఒకసారి వింటే ఏదీ మర్చిపోని శిక్షణ మాకిస్తారు. అంతా గుర్తుంది. వీలైనంతవరకు ఇవాళ రాత్రే పని పూర్తిచేస్తాను."

"ఎఫ్.ఐ.ఆర్. కాపీ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ జిరాక్స్ కాపీ నాకు కావాలి. "

"అలాగే. రేపు మా జవానుతో మీ ఇంటికి పంపిస్తాను. ఇల్లు నాకు తెలుసు. కాకపోతే ఐ.ఎస్.ఐ ఏజంట్లని ఎఫ్.ఐ.ఆర్‌లో నమోదు చేయను. ఎందుకంటే ఐ.ఎస్.ఐ ఏజంట్లు దాడి చేసారని తెలిస్తే తక్షణం కేసు సి.బి.సి.ఐడి హెండోవర్ చేసుకుంటుంది. ఐ.బి ఇన్స్‌పెక్టర్లు నా దగ్గరికి వివరాలకి వస్తారు. మీవాడి దగ్గరకీ వస్తారు. ఒంటిమీద గాయాలు లేకపోవడంతో అంతా ఫాల్స్ అని తేలుతుంది."

"నా కర్థమైంది. గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేస్తే తప్పించుకున్నాడంటే చాలు. ఓ వారం రోజుల తర్వాత ఇలాంటిదే ఇంకో పోలీస్ స్టేషన్ పరిధిలో కావాలి. ఆ మధ్య పేపర్లో చదివాను. నాగార్జున సాగర్ రోడ్ పోలీస్ స్టేషన్‌కి సి.ఐ.ని లంచం కేసులో సస్పెండు చేసారని. అతను తిరిగి అక్కడ డ్యూటీ చేస్తున్నాడు. అతనితో కూడా మాట్లాడి అక్కడ కూడా.."

"అతనొద్దండి. చాలా తినేరకం. డబ్బు కోసం తర్వాత కూడా పీడిస్తాడు" ఆగి కొద్దిక్షణాలు ఆలోచించి చెప్పాడు.

"హయత్‌నగర్ ఎస్.ఐ నా బేచ్‌మేట్ ఒకతను వున్నాడు. అతను మనకి సహాయం చేయచ్చు. అది ఓకేనా?"

"ఓకే."

"అయితే కనుక్కుని వుంచుతాను. కాకపోతే ఇంకో అయిదువేలు ఎక్స్‌ట్రా అవుతుంది. నా వంతు నేనిక్కడ తీసుకోవడంలేదు. కానీ అతనలా కాదుగా."

"ఓకే."

శివాజీ చేతిలోని సిగరెట్ ఆఖరి దమ్ములాగి పారేశాడు. అతని దగ్గర శెలవు తీసుకున్నాడు గోపీనాథ్. శివాజీ కొద్దిసేపు అక్కడే వుండి ఆలోచిస్తుండిపోయాడు. తర్వాత జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి ఇంకో సిగరెట్‌ని బయటికి తీసాడు. కానీ అంతలోనే మనసు మార్చుకున్నట్లుగా దాన్ని మళ్ళీ లోపల వుంచేసాడు.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**